క్లుప్తంగా

'రైతు ర్యాలీతో మంత్రికి చలనం కలిగింది'



మాట్లాడుతున్న హేమసుందర్‌రాజు

టెక్కలి: టెక్కలి నియోజకవర్గంలో రైతుల సమస్యలపై వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీన నిర్వహించిన రైతు ర్యాలీతో వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడుకు చలనం కలిగిందని పార్టీ కోటబొమ్మాళి మండలం అధ్యక్షుడు సంపతిరావు హేమసుందర్‌రాజు పేర్కొన్నారు. మంగళవారం విలేకర్లతో ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో రైతులకు సకాలంలో ఎరువులు, శివారు ప్రాంతాలకు సాగునీరు అందకపోవడం, అర్హులైన రైతులకు అన్నదాత సుఖీభవ పథకానికి లేని పోని కొర్రీలు వేయడం తదితర సమస్యలపై టెక్కలిలో ర్యాలీ నిర్వహించడంతో మంత్రి అచ్చెన్నాయుడుకు చలనం కలిగి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారని పేర్కొన్నారు. ప్రస్తుతం రెండో విడతగా రైతులకు ఎరువులు అవసరమన్నారు. అయితే క్షేత్రస్థాయిలో ఎరువులు అందుబాటులో లేవని గుర్తు చేశారు. వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్న అచ్చెన్నాయుడు కనీసం తన సొంత నియోజకవర్గంలో రైతుల గురించి పట్టించుకోవాలని కోరారు.

యాప్‌లో డీలర్ల వివరాలు నమోదు



:డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న సంతోష్

ఇచ్ఛాపురం రూరల్: రేషన్ దుకాణాలకు సంబంధించి ఈపీడీఎస్ యాప్‌లో సంబంధిత డీలర్ వివరాలు నమోదు చేస్తున్నట్టు పౌరసరఫరాల అధికారి కె.సంతోష్ వెల్లడించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఇచ్ఛాపురం మండలం, మున్సిపాలిటీ, కవిటి మండలాలకు చెందిన రేషన్ డీలర్లతో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డీలర్ బ్యాంకు అకౌంట్, ఫొన్, ఆధార్ కార్డులను ఈపీడీఎస్ యాప్‌లో పొందుపర్చడం ద్వారా రేషన్ దుకాణంలో ఉండే స్టాక్ వివరాలు తెలుస్తాయన్నారు. అలాగే బినామీ అమ్మకాలకు, ఇతర అవకతవకలకు చెక్ పడనుందన్నారు. వృద్ధులు, దివ్యాంగులకు ప్రతీ నెల 26వ తేదీ నుంచి నెలాఖరు వరకు నిత్యావసర సరుకులు నేరుగా వారి ఇంటికి వెళ్లి అందజేయాలని సూచించారు.

ఉద్దానం ప్రాజెక్టు కార్మికుల ధర్నా



ధర్నా చేస్తున్న ఉద్దానం ప్రాజెక్టు కార్మికులు

పలాస: తమను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని ఉద్దానం వాటర్ ప్రాజెక్టులో పనిచేస్తూ తొలగింపునకు గురైన కాంట్రాక్టు కార్మికులు డిమాండ్ చేశారు. అకారణంగా మెగా కంపెనీ తమను తొలగించడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు కాశీబుగ్గలోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మొత్తం 104 మంది కార్మికులను అకారణంగా తొలగించారన్నారు. తక్షణమే విధుల్లోకి తీసుకోకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని చెప్పారు. ధర్నాలో సంఘం నాయకులు బి.జోగారావు, కె.నీలాచలం, డి.మల్లేశ్వరరావు, సీహెచ్ ముకుందరావు, పి.కూర్మారావు, పి.మోహనరావు, కె.తులసీరావు, ఎస్.మోహనరావు, కె.రాజాచంద్రశేఖర్ పాల్గొన్నారు.

క్షయపై అప్రమత్తంగా ఉండాలి



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పలాస: క్షయ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జె.వెంకటలక్ష్మి అన్నారు. ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ ర్యాలీని మంగళవారం పట్టణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. క్రమం తప్పకుండా మందులు వాడితే టీబీ వ్యాధి నయమవుతోందన్నారు. కార్యక్రమంలో యూత్ రెడ్ క్రాస్ సొసైటీ కోఆర్డినేటరు ఎల్.గణపతిరావు, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ పి.వెంకటరమణ, పీడీ డాక్టర్ పి.మధు, బి.నరిసింహులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు శిథిలం!



టెక్కలి అంబేడ్కర్ జంక్షన్‌లో గోతులమయమైన రోడ్డు

టెక్కలి: టెక్కలి అంబేడ్కర్ జంక్షన్‌లో ప్రధానరోడ్డుపై గోతులు ప్రమాదకరంగా మారాయి. గత ఏడాది కార్తీక మాసోత్సవాల సందర్భంగా హడావుడిగా తారు పూతలతో మరమ్మతులు చేశారు. అయితే మరమ్మతులు చేసిన కొద్ది నెలలకే రోడ్డు గోతులుగా మారింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఆ గోతుల్లో నీరు చేరడంతో ప్రమాదకరంగా తయారైంది. మరమ్మతులు చేసిన కొద్దిరోజులకే రోడ్డు గోతులుగా మారడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వీడని విద్యుత్ వెతలు!

- వినియోగదారులకు తప్పని కరెంటు కష్టాలు
- సిబ్బంది ఉన్నా నిరంతరం అంతరాయాలే



వ్యవసాయ ఫీడర్ లేని కవిటి విద్యుత్‌సబ్‌స్టేషన్

కవిటి: కూటమి సర్కార్ హయాంలో నాణ్యమైన విద్యుత్ సరఫరా జరగడం లేదని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. నిరంతరం ఏదో ఒక సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని మండిపడుతున్నారు. జిల్లాలో మారుమూలన విసిరేసినట్టుగా ఉన్న కవిటి మండల ప్రజలు తీవ్రమైన విద్యుత్ కష్టాలు ఎదుర్కొంటున్నారు. గడచిన వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయాల వ్యవస్థ పుణ్యమాని విద్యుత్‌శాఖలో ఎనర్జీ అసిస్టెంట్ల నియామకాలు బాగానే జరిగాయి. కానీ అన్నీ ఉన్నా అల్లుడు నోట్లో శని అనే చందంగా విద్యుత్‌శాఖ తీరు నెలకొంది. మండలంలో బొరివంక, కవిటి, రాజపురంలో విద్యుత్ సబ్‌స్టేషన్లు ఉండగా.. వీటి పరిధిలో 24,225 కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో కేటగిరీ–1 కింద 20,859, కేటగిరీ–2 కింద 1387, కేటగిరీ–3 కింద 57, కేటగిరీ–4 కింద 686, కేటగిరీ–5 కింద 1236 కనెక్షన్లు ఉన్నాయి. వీరికి నిరంతరం విద్యుత్ సమస్యలు వెంటాడుతున్నాయి. ప్రధానంగా రాజపురం సబ్‌స్టేషన్ పరిధిలోని శిలగాం, కొజ్జీరియా ఫీడర్లు, బొరివంక సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని ఫీడర్లలో తరచూ విద్యుత్ అంతరాయాలతో వినియోగదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ బిల్లుల పెంపుదల తారస్థాయిలో ఉండగా అంతరాయాలు మాత్రం తీవ్రంగా ఉన్నాయి. మండలంలోని 24,225 కనెక్షన్ల నుంచి ప్రతీనెల రూ.1.03 కోట్ల బిల్లులు వినియోగదారుల నుంచి చెల్లింపులు జరుగుతున్నాయి.

వేరే ప్రాంతానికి తరలింపు

కవిటిలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హాయంలో సబ్‌స్టేషన్ ఏర్పాటు చేశారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇక్కడున్న సీల్డ్ ట్రాన్స్‌ఫార్మర్‌ను సర్దుబాటు చర్యల్లో భాగంగా వేరే ప్రాంతానికి తరలించడంతో సబ్‌స్టేషన్ పడకేసింది. అంతేకాకుండా అధికారుల అనాలోచిత చర్యల వల్ల సబ్‌స్టేషన్లో పనులు కూడా పూర్తిచేయకుండా అగ్రికల్చర్ ఫీడర్ పనులు నిలిపేయడంతో కవిటి, కపాసుకుద్ధి, నెలవంక పంచాయతీల అన్నదాతలకు తీవ్ర ఇబ్బందులు నెలకొన్నాయి. మండలంలో ట్రీ క్లియరెన్స్ పనులు కూడా సక్రమంగా చేయకపోవడంతో అంతరాయాలు తీవ్రస్థాయిలో ఎదురవుతున్నాయి. వేలాది రూపాయలు బిల్లులు చెల్లిస్తున్న వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందని ద్రాక్షగా మారింది. మండల సర్వసభ్య సమావేశాల్లో సైతం ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు విద్యుత్ సమస్యలను ప్రస్తావిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు మాత్రం తూతూమంత్రంగా సమాధానాలిచ్చి దాటవేస్తున్నారే తప్ప పరిష్కారం కోసం చర్యలు లేవు. అన్నదాతకు అందిస్తున్న ఉచిత విద్యుత్ పథకంలో బ్రేక్‌డౌన్లు, ఎల్‌సీలతో రాజ్యమేలుతున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు ఈ వ్యవహారంపై పట్టీపట్టనట్టు ఉండడంతో వినియోదారులకు విద్యుత్ కష్టాలు తప్పడం లేదు.



విద్యుత్ సమస్యలను మండల సమావేశంలో ప్రస్తావిస్తున్న వరక ఎంపీటీసీ సభ్యుడు కృష్ణారావు (ఫైల్)

ఏడాదిగా విద్యుత్ కష్టాలు



గడచిన ఏడాది కాలంగా కవిటి మండలంలో విద్యుత్ కోతలు దారుణంగా ఉంటున్నాయి. బిల్లులు మాత్రం రూ. వేలల్లో వస్తున్నాయి. అయినప్పటికీ వినియోగదారులు అప్పుచేసైనా బిల్లు కట్టేస్తున్నారు. రైతులకు, ఇళ్లకు అనే తేడాల లేకుండా సరఫరాలో జాప్యం కవిటి మండల ప్రజలకు శాపంగా మారింది. జిల్లా అధికారులు దీనిపై బాధ్యత తీసుకోవాలి. కవిటి సబ్‌స్టేషన్‌లో వ్యవసాయ ఫీడర్ వెంటనే యాక్టివేట్ చేయాలి.

– నర్తు రామారావు, ఎమ్మెల్సీ

ఇబ్బందులు వాస్తవమే..



కవిటి మండల కేంద్రంలో ఉన్న సబ్‌స్టేషన్‌లో ప్రస్తుతం టౌన్ ఫీడర్‌కు మాత్రమే సరఫరా అందించడం జరుగుతోంది. ఇక్కడ నుంచి వ్యవసాయ ఫీడర్ ద్వారా కవిటి, కపాసుకుద్ధి, పుటియాదల, నెలవంక రైతులకు విద్యుత్ అందించాల్సి ఉన్నప్పటికీ అందించలేకపోవడం శాఖాపరమైన తప్పిదమే. సామగ్రి లేకపోవడం కారణంగానే పనుల్లో జాప్యం నెలకొంది. చాలా చోట్ల ప్రయత్నించినా కొంత సామగ్రి లభ్యత లేకపోవడం వల్ల కవిటిలో వ్యవసాయ ఫీడర్ నేటికీ ప్రారంభించలేకపోయాం. రైతులకు రాజపురం నుంచి ఇస్తున్న సరఫరా కారణంగా తీవ్రంగా బ్రేక్‌లు వస్తున్న మాట వాస్తవమే.

– కె.శ్రీనివాస్, విద్యుత్‌శాఖ ఏఈ, కవిటి మండలం

విద్యార్థులకు నేత్ర పరీక్షలు

సంతబొమ్మాళి: విద్యార్థులు తప్పని సరిగా కంటి పరీక్షలు చేయించుకోవాలని ఎంఈవోలు చిన్నవాడు, అర్జునుడు అన్నారు. జాతీయ అంధత్వ దృష్టిలోప నివారణ కార్యక్రమంలో భాగంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యతో దండుగోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం నేత్ర పరీక్షలు నిర్వహించారు. దృష్టిలోపం ఉన్న విద్యార్థులకు కంటి అద్దాలు సూచించినట్లైతే తప్పని సరిగా ధరించాలని అన్నారు. ముందస్తు కంటి పరీక్షలు నిర్వహించటం వల్ల దృష్టిలోపం ఉన్నట్లైతే ముందుగానే గుర్తించి సరి చేయడం వలన శాశ్వత అంధత్వానికి గురికాకుండా కంటి చూపును కాపాడుకోవచ్చన్నారు. ఈ నెల 21 నుంచి అక్టోబర్ 31వ తేదీ వరకు ఆరు నుంచి 18 సంవత్సరాలు ఉన్న ప్రతి విద్యార్థికి కంటి పరీక్షలు నిర్వహిస్తామన్నారు. పీహెచ్‌సీ వైద్యులు ఎం.విశ్వనాథగంగాధర్, ఆప్తాలిమిక్ ఆఫీసర్ ఎం.ఆర్.కె.దాస్, ప్రాధానోపాధ్యాయులు పి.గంగన్న ఉన్నారు.



వైద్య శిబిరంలో నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్యులు ఎం.ఆర్.కె. దాస్, అంజలి

నౌపడలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

నౌపడలో నారాయణ కమలం శ్రేయోనిధి ఆధ్వర్యంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో మంగళవారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 120 మందికి కంటి పరీక్షలు చేసి.. 40 మందిని శస్త్రచికిత్స కోసం శ్రీకాకుళం శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి తరలించారు. కార్యక్రమంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ పరిమళ, ఆఫ్తాల్మిక్ అధికారి ఎం.ఆర్.కె.దాస్, శంకర్ ఫౌండేషన్ అప్టోమెట్రిక్ ఎస్.అంజలి, నారాయణ, కమలం శ్రేయోనిధి కమిటీ సభ్యులు చెన్నూరు విజయానందరావు, లోపింటి జయకృష్ణారెడ్డి, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగులకు న్యాయం చేయాలి



మాట్లాడుతున్న కమిషనర్ రామారావు

పలాస: దివ్యాంగు పింఛన్‌దారులు నష్టపోకుండా చూడాలని పలాస–కాశీబుగ్గ మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లను ఆదేశించారు. తన కార్యాలయంలో మంగళవారం సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. రద్దయిన దివ్యాంగుల పింఛన్‌లబ్ధిదారులతో మరోసారి దరఖాస్తు చేయించి కమిషనర్ లాగిన్‌లో అప్లోడ్ అయ్యేటట్టు చేయాలని కోరారు. పింఛన్ రాని వారందరికీ ప్రభుత్వం మళ్లీ వైద్య పరీక్షలు చేయిస్తుందని.. అందుకు వారికి వెల్ఫేర్ అసిస్టెంట్లు సహకరించాలన్నారు.

శిథిలమైన వంతెన రక్షణ గోడలు!

టెక్కలి: టెక్కలి నుంచి పాతపట్నం వెళ్లే రోడ్డులో గంగాధరపేట గ్రామం సమీపంలో వంతెనల రక్షణ గోడలు శిథిలావస్థకు చేరాయి. దీంతో ఆ మార్గంలో రాకపోకలు సాగించే వారంతా భయాందోళన చెందుతున్నారు. రెండు వంతెనల వద్ద రక్షణ గోడలు మరమ్మతులకు గురి కావడంతో కొంతమంది వాహనదారులు ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ఇసుక బస్తాలను అడ్డుగా వేశారు. అయితే పెద్ద ప్రమాదాలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.



గంగాధరపేట గ్రామం సమీపంలో వంతెన వద్ద ప్రమాదాలు జరగకుండా వేసిన ఇసుక బస్తాలు



శిథిలమైన వంతెన రక్షణగోడ

ఆక్రమణలో కాలువ గట్లు!

- సాగునీరు అందక రైతులు ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు

సంతబొమ్మాళి: కాలువగట్లను సైతం ఆక్రమణదారులు విడిచిపెట్టడం లేదు. సంతబొమ్మాళి మండలంలో ఈ పరిస్థితి ఇటీవల ఎక్కువైంది. వంశధార పంట కాలువ గట్లను ఆక్రమించేస్తుండడంతో సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గట్లను ఎక్కడకక్కడే చెక్కేయడంతో పల్చబడి బోడిగుండుల్లా దర్శినమిస్తున్నాయి. కొన్నిచోట్ల కాలువ గట్లను రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించడం, మరికొందరు గట్టుపై మొక్కలు నాటడం, కాలువను ఆనుకొని నిర్మాణాలు చేపట్టడం వంటివి చేయడం వల్ల నడవడానికి వీలు లేకుండా పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కాలువలు కృషించి పోవడంతో సాగునీరు పారక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని హెచ్.ఎన్.పేట, పోతునాయుడుపేట, దండుగోపాలపురం, యామలపేట, వడ్డితాండ్ర, బోరుభద్ర, కొల్లిపాడులోని కాలువల ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. హెచ్.ఎన్.పేటలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు కాలువకు అడ్డంగా మట్టివేయడంతో సాగునీరు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీనిపై పలువురు రైతులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో కాలువలో వేసిన మట్టిని తొలగించాలని రియల్ ఎస్టేట్ వ్యాపారులకు ఆదేశించారు. అయితే ఆదేశించి 20 రోజులు దాటినప్పటికీ కాలువకు అడ్డంగా వేసిన మట్టిని తొలగించకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పోతునాయుడుపేట కాలువ గట్టును కొందరు ఆక్రమణదారులు మట్టివేసి కబ్జా చేశారు. దీన్ని అధికారులు పరిశీలించినప్పటికీ చర్యలు మాత్రం లేవు. దండుగోపాలపురం, వడ్డితాండ్ర, బోరుభద్ర కాలువ గట్లను ఆక్రమించి కొందరు నిర్మాణాలు చేపట్టారు. దీంతో కాలువ గట్టు బక్కచిక్కి నడవడానికి వీలు లేకుండా తయారైంది. వంశధార కాలువపై చాలా చోట్ల అనాధికార వంతెనల నిర్మాణాలు చేయడంతో నీరు ప్రవహించే మార్గానికి ఆటంకంగా మారాయి. ఈ ప్రాంతమంతా ముంపు ప్రాంతం కావడం, సాగునీరు ప్రవహించే కాలువలు ఆక్రమణలకు గురికావడంతో ఏటా వర్షాలకు పంటలు నీట మునిగి రైతులకు తీవ్ర నష్టం చేకూరుతున్నాయి. ఆక్రమదారులపై అధికారులు చర్యలు తీసుకోకపోవడం వల్ల మరింత బరితెగించి ఏటా కాలువలను దురాక్రమణ చేసి రైతుల పొట్టను కొడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



హెచ్.ఎన్.పేటలో కాలువకు అడ్డంగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు వేసిన మట్టి



పోతునాయుడుపేటలో కాలువను కబ్జా చేసిన ఆక్రమణదారులు

ఆక్రమణలు తొలగించండి

వంశధార, పిల్ల కాలువలు చాలా చోట్ల ఆక్రమణకు గురయ్యాయి. దీంతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నాం. అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించాలి.

– వి.వాసుదేవరావు, రైతు, సంతబొమ్మాళి

అధికారులు స్పందించాలి

రియల్ ఎస్టేట్ వ్యాపారులు కాలువకు అడ్డంగా మట్టి వేయడం, కాలువలపై అనాధికార వంతెన నిర్మాణం చేపడుతున్నారు. ఎవరు చెప్పినా పట్టించుకోవడం లేదు. దీనిపై అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలి.

– కె.శ్రీనివాసరావు, రైతు, సంతబొమ్మాళి

చర్యలు తప్పవు

సాగునీటి కాలువ గట్లను ఆక్రమిస్తే చర్యలు తప్పవు. హెచ్.ఎన్.పేటలో కాలువకు అడ్డంగా వేసిన మట్టిని తొలగించమని రియల్ ఎస్టేట్ వ్యాపారిని ఆదేశించాం.

– హేమసుందర్‌రావు, తహసీల్దార్, సంతబొమ్మాళి

రోడ్డు భద్రతపై అవగాహన



ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకటఅప్పారావు అన్నారు. పలాస మండలం లక్ష్మీపురం టోల్ గేటు వద్ద మంగళవారం ద్విచక్ర వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. రోడ్డు భద్రత నియమ నిబంధనలను విధిగా పాటించాలని చెప్పారు. హెల్మెట్ ధరించిన వాహనదారులకు చాక్లెట్ అందజేసి అభినందించారు. హెల్మెట్ ధరించని వారికి ఈ–చలానా ద్వారా అపరాధ రుసుం విధించారు.

–పలాస

భక్తిశ్రద్ధలతో అష్టలక్ష్మి పూజలు



ఇచ్ఛాపురం గ్రామదేవత స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో శ్రావణ మంగళవారం పురస్కరించుకొని సామూహిక అష్టలక్ష్మి వ్రత పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బరంపురం వేంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రధాన అర్చకులు చామర్తి శ్రీనివాసరమేష్ ఆచార్యస్వామి పర్యవేక్షణలో నిర్వహించిన సామూహిక వ్రత పూజల్లో 444 మంది మహిళలు పాల్గొన్నారు. పూజలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

–ఇచ్ఛాపురం

భయపెడుతున్న శునకాలు



టెక్కలి పరిసరాల్లో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తూ మనుషులపై దాడులకు పాల్పడుతున్నాయి. రాత్రిపగలనే తేడాలేకుండగా రోడ్లపై గుంపులుగా సంచరిస్తూ వాహనదారులను వెంటాడుతున్నాయి. దీంతో చాలామంది భయంతో అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. పిల్లలను బయటకు పంపించేందుకు తల్లిదండ్రులు భయపడుతున్నారు. అధికారులు స్పందించి కుక్కలను నియంత్రించాలని కోరుతున్నారు.

–టెక్కలి రూరల్

ఫొటోతో జ్ఞాపకాలు పదిలం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న సీఐ మంగరాజు, తహసీల్దార్ రమేష్‌కుమార్ తదితరులు

టెక్కలి: ఫొటోలతో జ్ఞాపకాలు పదిలంగా ఉంటాయని టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు అన్నారు. కళాశాలలో వరల్డ్ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన ఫొటోగ్రఫీ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, అధ్యాపకులు డి.యుగంధర్, శాక్ ఇన్‌చార్జి కె.సురేష్ పాల్గొన్నారు.

కంచిలి: ఉద్దానం ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని మండల కేంద్రం కంచిలిలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్, ఉద్దానం బ్లడ్ బ్యాంక్ సంయుక్తంగా ఫొటోగ్రాఫర్స్ అందరూ కలిసి మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఇందులో ఫొటోగ్రాఫర్లు, వారి స్నేహితులు 50 యూనిట్ల బ్లడ్‌ను స్వచ్ఛందంగా ఇచ్చారు. ఈ సందర్భంగా వేదిక వద్ద స్థానిక తహసీల్దార్ ఎస్.రమేష్‌కుమార్, సోంపేట సీఐ బి.మంగరాజు, ఎస్సై పి.పారినాయుడుల చేతులమీదుగా మొక్కలు నాటారు. ఉద్దానం ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పొట్నూరు రాజశేఖర్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నానో యూరియాతో అధిక దిగుబడులు

సోంపేట: నానో యూరియా వినియోగంతో అధిక దిగుబడులు సాధ్యమని సోంపేట వ్యవసాయ సహాయ సంచాలకులు భవానీశంకరరావు అన్నారు. కర్తలిపాలెం, పాత్రకొండ పంచాయతీల పరిధిలో మండల వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తితో కలిసి 'పొలం పిలుస్తోంది'కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు వరిసాగులో తీసుకోవాల్సిన మెలకువలపై సలహాలు సూచనలు అందజేశారు. నానో ఎరువులు వాడడం వలన పంటకు అధికస్థాయిలో పోషకాలు అందుతాయని వివరించారు. పాత్రకొండ, కర్తలిపాలెం సర్పంచ్‌లు బేసి ఖగేశ్వరరావు, పొందూరు గున్నయ్య, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

నందిగాం: వరిలో నానో యూరియా వినియోగంతో మంచిఫలితాలు వస్తాయని మండల వ్యవసాయాధికారి పి.శ్రీకాంత్‌వర్మ సూచించారు. బోరుభద్ర పంచాయతీ వెంకన్నపేటలో 'పొలం పిలుస్తోంది'కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. నానో యూరియా వినియోగించుకొని తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందవచ్చని అన్నారు. ఎకరాకు 500 ఎంఎల్‌ను రెండు వందల లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. అలాగే రైతులందరూ ఈ–క్రాప్ నమోదు చేసుకోవాలన్నారు.

కంచిలి: వరిసాగులో యాజమాన్య పద్ధతులు తప్పనిసరిగా పాటించాలని మండల వ్యవసాయాధికారి కె.సురేష్ అన్నారు. కొక్కిలిపుట్టుగ, మండపల్లి గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రస్తుతం వరినాట్లు వేస్తున్న నేపథ్యంలో ఎరువుల యాజమాన్యం, కలుపు నివారణ గురించి తెలియజేశారు. రైతులు తమపంటలను ఈక్రాప్‌లో నమోదు చేసుకోవాలని, డ్రోన్ ద్వారా నానో యూరియా, నానో డీఏపీ వినియోగించాలని సూచించారు. పంట సాగుహక్కు పత్రం ఉపయోగాలను కౌలు రైతులకు తెలియజేశారు. గ్రామ వ్యవసాయ సహాయకులు గణపతి పాల్గొన్నారు.

ఊరటనిచ్చిన వర్షం



బహుదానది పరీవాహక ప్రాంతంలో నాట్లు వేసేందుకు సిద్ధమైన పొలాలు

ఇచ్ఛాపురం రూరల్: అల్పపీడనం ప్రభావంతో మూడు రోజుల పాటు కురిసిన వర్షాలు రైతులకు ఊరటనిచ్చాయి. నదులు, చెరువులు, గెడ్డలు జలకళను సంతరించుకున్నారు. ఆంధ్రాతో పాటు ఒడిశాలో భారీ వర్షాలు కురవడంతో ఇచ్ఛాపురం మండలంలోని బహుదానదిలో వరద నీరు అధికంగా చేరింది. దీంతో చానెళ్ల ద్వారా నీరుపారుతుండడంతో రైతులు దమ్ములు చేసి వరినాట్లు వేయడంలో మునిగిపోయారు. నియోజకవర్గ ప్రత్యేకాధికారిగా వ్యవహరిస్తున్న డ్వామా పీడీ బమి.సుధాకరరావు మంగళవారం డొంకూరు మత్స్యకార తీర ప్రాంతాన్ని సందర్శించి స్థానిక మత్స్యకారులతో మాట్లాడారు. రెండు, మూడు రోజుల వరకు మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదని సూచించారు. ఇరిగేషన్ శాఖ ఏఈ మధుసూధన పాణిగ్రాహి మాట్లాడుతూ.. ఒడిశాలోని భగలట్టీ రిజర్వాయర్ కెపాసిటీ 106 మీటర్లు ఉండగా..అక్కడ అధికారుల సమచారం మేరకు ప్రస్తుతం 93 మీటర్లు ఉందని, రైతులు ఆందోళన చెందనవసరం లేదని స్పష్టం చేశారు.